ఘనంగా సైన్స్ ప్రతిభా పోటీలు

నర్సాపూర్ (జీ) : ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎదులాపురం/బోథ్/నర్సాపూర్ (జీ)/ ఇంద్రవెల్లి/ ఖానాపూర్ రూరల్/తానూర్/ ఇచ్చోడ(సిరికొండ)/ కడెం/ లోకేశ్వరం/లక్ష్మణచాంద, నవంబర్ 21: ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు చెకుముకి సైన్స్ ప్రతిభా పోటీలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. పాఠశాలలో చెకుముకి సైన్స్ వారోత్సవాల్లో భాగంగా జీవ పరిణామ సిద్ధాంతం ప్రచార ఉద్యమం పోస్టర్లను ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు, జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఎదులాపురం, నవంబర్ 21: ఇటీవల నూతనంగా బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఆర్కిటెక్ట్స్, ఇంజినీర్స్ అండ్ ఎల్టీపీస్ అసోసియేషన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఇక్కడ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రబ్, కోశాధికారి మాటేటి రాజు, బీ విజయ్, బత్తుల శ్రీనివాస్, అల్మాస్, శివకృష్ణ, అన్వర్ ఉన్నారు.

బాధితుడికి మాజీ ఎంపీపీ పరామర్శ

బోథ్, నవంబర్ 21 : మండలంలోని బాబెర మాజీ ఉప సర్పంచ్ రవి ఇటీవల ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడడంతో గాయాలయ్యాయి. గురువారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఇక్కడ మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, సురేశ్, బాబుసింగ్, పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, నాయకులు రూప్‌చంద్, రవి తదితరులున్నారు.

రిమ్స్ అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

ఎదులాపురం, నవంబర్ 21 : ఆదిలాబాద్ రిమ్స్‌లో డిప్లొమా ఇన్ ఆప్తల్మిక్ అసిస్టెంట్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డైరెక్టర్ జై సింగ్ తెలిపారు. లిస్ట్‌ను నోటీసు బోర్డుపై ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22న రిమ్స్ ఆఫీసులో సంప్రదించాలని, లిస్టులో ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌తో ఈనెల 23న హాజరు కావాలన్నారు.

23న ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు

ఎదులాపురం, నవంబర్ 21 : జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈనెల 23న ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి అండర్–17 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం జిల్లాల జట్టు ఈ ఎంపిక పోటీల్లో తలపడతాయన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్, క్యాచింగ్, ఫీల్డింగ్ అంశాల్లో అత్యుత్తమంగా రాణించిన క్రీడాకారులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని వివరించారు.

మేన కోడలిపై లైంగిక దాడి

ఎదులాపురం, నవంబర్ 21 : జిల్లా కేంద్రంలోని ఒక కాలనీకి చెందిన బాలిక (17)పై మేనమామ లైంగికదాడి చేసిన ఘటన వెలుగు చూసింది. కూలి పనులు చేసుకునే నిందితుడి(38)కి వివాహమై ముగ్గురు పిల్లలున్నారు. మేనకోడలికి ఎనిమిది నెలలుగా మాయమాటలు చెప్పి లైంగికదాడి చేస్తున్నాడు. ఈ విషయం బయటకు చెప్పొద్దని బాలికను భయపెట్టాడు. ఇటీవల ఆ బాలికకు కడుపు నొప్పి వస్తుండడంతో దవాఖానలో చూపించగా గర్భవతి అని వైద్యులు చెప్పారు. బాధిత బాలిక తల్లి మావల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

గుడుంబా విక్రయదారుల బైండోవర్

ఖానాపూర్ టౌన్, నవంబర్ 21: గుడుంబా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు గురువారం తహసీల్దార్ శివరాజ్ ఎదుట బైండోవర్ చేశారు. పట్టణంలోని శాంతినగర్, సుభాష్‌నగర్ కాలనీలకు చెందిన సూర లక్ష్మి, బొంగోని లక్ష్మి, రంగపేట్‌కు చెందిన మాటేటి అశోక్, మేడంపెల్లి గ్రామానికి చెందిన అనపర్తి అనసూయను గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బైండోవర్ ఉల్లంఘించి గుడుంబా అమ్మినా, తయారు చేసినా జరిమానాతోపాటు జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

పులి మకాం

- నార్నూర్, గాదిగూడ మండలాల్లో కదలికలు
- నాలుగు రోజులుగా అటవీ ప్రాంతంలో సంచారం
- పశువులు, గేదెలపై దాడి.. జంకుతున్న ప్రజలు

రాంపూర్‌లో ఆవుపై దాడి చేసిన పులి

రాంపూర్ అడవిలో పులి పాదముద్రలు

నార్నూర్, నవంబర్ 21 : గాదిగూడ, నార్నూర్ మండలాల్లో పులి కదలికలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల క్రితం గుంజాల శివారులో కనిపించిన పులి చోర్‌గావ్‌లో ఎద్దుపై దాడి చేసింది. బుధవారం గాదిగూడ మండలంలోని ఖడ్కి శివారులో కనిపించింది. గురువారం వేకువజామున గాదిగూడ మండలంలోని రాంపూర్ గ్రామంలో హెచ్‌కే ప్రకాశ్‌కు చెందిన ఆవుపై దాడి చేసింది. నార్నూర్ మండలంలోని గుంజాల, గంగాపూర్, మన్కాపూర్ గ్రామాల్లోని అటవీ సమీపంలో పులి సంచరిస్తూ మధ్యాహ్నం కనిపించింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలకు కనిపించడంతో పరుగులు తీసినట్లు రైతులు తెలిపారు. దీంతో గుంజాల, గంగాపూర్ గ్రామస్తులు అప్రమత్తమై డప్పు చప్పుడు, కేకలు వేస్తూ పులిని తరిమేశారు. నాలుగు రోజులుగా నార్నూర్, గాదిగూడ మండలాల్లో పులి సంచరిస్తున్నది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు పులి బారినుంచి కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎదులాపురం, నవంబర్ 21 : ఆటో బోల్తా పడి ఒక మహిళ మృతి చెందింది. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మున్ని బీ(53), భర్త ఫారుఖ్ ఇద్దరూ పాత బట్టలు విక్రయించే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఆటోలో పాత బట్టలను నింపుకొని ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు బయలుదేరారు. ఈ క్రమంలో చాందా గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో మున్నిబీ అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఫారుఖ్ అహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆటోలో ఓవర్ లోడ్‌తో అతివేగంగా వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతుకు గాయాలు

ఎదులాపురం, నవంబర్ 21 : ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తాంసి మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన రైతు పవార్ ప్రవీణ్ గాయపడ్డాడు. పత్తి విక్రయించడానికి వచ్చిన రైతు కాలుపై నుంచి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో కాలికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అతడిని 108లో రిమ్స్‌కు తరలించారు.

నాణ్యమైన సేవలకు టోల్‌ఫ్రీ నంబర్లు

ఎదులాపురం, నవంబర్ 21 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్న సంకల్పంతో ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్ ఫ్రీ నంబర్1912 ముద్రిస్తున్నామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా, వాటి పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేసీఆర్ హయాంలోనే గ్రంథాలయానికి నిధులు

కుభీర్ : గ్రంథాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్, నవంబర్ 21 : కుభీర్‌లో గ్రంథాలయ భవనం లేక విద్యావంతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్‌కు వివరించడంతో వెంటనే రూ.15లక్షల మంజూరు చేశారని మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. గురువారం మండలకేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్, రోడ్ల మరమ్మతులకు మంజూరైన నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేసి వెళ్తుండగా దారిలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించారు. ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అంటూ పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఈగ్రంథాలయంలో చదువుకున్న ఇద్దరు విద్యార్థులు ఉపాధ్యాయ కొలువులు సాధించడంపై ఆయన అభినందించారు. ఈయన వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పుప్పాల పీరాజీ, నాయకులు తూం రాజేశ్వర్, సంతోష్, శంకర్ చౌహాన్, మంగళి నారాయణ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్ కాపీల అందజేత

భైంసా, నవంబర్, 21 : పట్టణంలోని గడ్డెన్న నివాసంలో లోకేశ్వరం మండలానికి చెందిన పలు గ్రామాలకు పంచాయతీరాజ్ రోడ్డు నిధులు మంజూరు కావడంతో సుమారు రూ.2 కోట్ల 40 లక్షల ప్రొసీడింగ్ కాపీలను ఆయా గ్రామాల నాయకులకు గురువారం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అందజేశారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, మాజీ ఎంపీపీ భోజన్న, రమణారెడ్డి, ముస్తాగౌడ్, నరేశ్, సాయిరెడ్డి, సుధాకర్, తదితరులున్నారు.

భైంసాటౌన్, నవంబర్ 21: కుభీర్ మండలంలోని గోడిసేరా గ్రామానికి చెందిన చిట్టపు హన్మండ్లుకు మంజూరైన రూ.38వేల 500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సాంగ్వి నుంచి కుభీర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.52వేల ప్రొసీడింగు కాపీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తుము రాజేశ్వర్, శంకర్ చవాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలి

నార్నూర్, నవంబర్ 21: విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని మండల ప్రత్యేకాధికారి గంగధార్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో తహసీల్దార్ జాడి రాజాలింగంతో కలిసి సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచికరంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

ప్లాంటేషన్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

ప్లాంటేషన్‌ను సందర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, నవంబర్ 21: మాజీ మంత్రి జోగు రామన్న పుట్టినరోజు వేడుకల్లో భాగంగా దుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన మియావాకీ ప్లాంటేషన్ నేడు చిట్టాడివిలా దర్శనమిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ప్లాంటేషన్‌ను సందర్శించారు. అనంతరం చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న ఈ మియావకీ ప్లాంటేషన్ గిన్నీస్ బుక్ రికార్డులో స్థానం కూడా సంపాదించుకుందని గుర్తు చేశారు. పట్టణ ప్రజానీకానికి స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించేందుకు దుర్గానగర్‌లో మొక్కల పెంపకానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని కొనియాడారు. ఆయన వెంట దమ్మపాల్, బట్టు సతీశ్ ఉన్నారు.

పోలీసుల అదుపులో ఆయుధాల ముఠా

- వారణాసి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా పట్టివేత

ఎదులాపురం, నవంబరు 21: ఆయుధాలు తరలిస్తున్న ఇద్దరిని ఆదిలాబాద్ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. స్టేట్‌బ్యూరో అధికారులు ఆదిలాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. జైనథ్ మండలంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వారణాసి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్న కారును చెక్ చేశారు. ఇందులో మూడు పిస్తోల్స్‌ను స్వాధీనం చేసుకుని.. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా తెలిపారు. వారి సమాచారం మేరకు మరో ఇద్దరిని హైదరాబాద్‌లో పోలీసులు పట్టుకున్నారు. వీరికి ఓ పార్టీతో సంబంధం ఉండగా.. గతంలో పలు హత్య కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు సమాచారం.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉట్నూర్ రూరల్, నవంబర్ 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పటభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ మాజీ మేయర్, ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. గురువారం మం డలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో పర్యటించి తిరుగు ప్రయాణంలో మాజీ ఎం పీపీ పంద్ర జైవంత్‌రాను మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం రవీందర్‌సింగ్ మాట్లాడుతూ, పట్టభద్రులైన నిరుద్యోగులకు ఉన్న సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను ఆదరించి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ పంద్ర లత, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, తదితరులున్నారు.

సంతోష్‌రాజ్ పిల్లల దవాఖానలో అరుదైన ఆపరేషన్

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్, 21 నిర్మల్ పట్టణంలోని సంతోష్‌రాజ్ పిల్లల దవాఖానలో నవజాత శిశువుకు అరుదైన ఆపరేషన్ విజయవంతమైంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామానికి చెందిన ఉమర్ నేహా దంపతులకు ఈనెల 11న పాప జన్మించింది. పాపకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడగా, నిర్మల్ పట్టణంలోని ఎస్‌వీఆర్ హాస్పిటల్‌లో చేర్పించారు. పాపను పరీక్షించిన డా.సంతోష్ రాజ్ ట్రాక్‌కో ఓయెసోఫాజియల్ ఫిస్టులా (అన్న వాహికకు, శ్వాసనాళంకు మధ్య అసాధారణ సంబంధం కలిగి ఉండడం)గా గుర్తించారు. ఈనెల 12 న డాక్టర్ సంతోష్‌రాజ్, డాక్టర్ దేవీదాస్, డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో నాలుగున్నర గంటలపాటు చేసిన ఆపరేషన్ విజయవంతం అయింది. దీంతో పాపను నాలుగు రోజులు పాటు వెంటిలేటర్‌లో ఉంచి పాప ఆరోగ్యం కుదుటపడడంతో గురువారం డిశ్చార్జి చేశారు. ఇటువంటి ఆపరేషన్ పెద్ద నగరాల్లోని కార్పొరేట్ దవాఖానల్లో నిర్వహిస్తుంటారు. అలాంటి ఆపరేషన్ ఇక్కడ చేశామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు వైద్యులను అభినందించారు.

పోస్టాఫీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

ఎదులాపురం, నవంబర్ 21: పోస్టాఫీస్ సేవలపై డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ద్వారా అవగాహన కల్పించడంతోపాటు సర్టిఫికెట్లను అందిస్తున్నామని ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ అన్నారు. 45 రోజుల ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న డిగ్రీ కళాశాల ముగ్గురు విద్యార్థులకు నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కలిసి పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ ఇంటర్న్‌షిప్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐపీపీబీ తరపున డిజిటల్ లావాదేవీలను సులభతరం చేసేలా వ్యాపారస్తుల కోసం డాక్ సేవా క్యూఆర్ కోడ్స్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐపీపీబీ మేనేజర్ రాజేశ్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అతీక్ బేగం, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ఖానాపూర్, నవంబర్ 21: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా భీష్మ పితామహుడి చిత్రపటానికి పూలమాలలు వేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పరిమి సురేశ్, రమేశ్, లాలు, విలాస్, చిన్న పెద్దులు, మధు, భీంరావు, చందు, నరేశ్, రమేశ్, గణేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎదులాపురం, నవంబర్21: మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ అన్నారు. గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శివాలయంలో అభిషేకంతోపాటు ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు భూమన్న, నాయకులున్నారు.

డీఈవోను కలిసిన ట్రస్మా నేతలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 21 : ఇటీవల నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామారావును గురువారం ట్రస్మా ఉపాధ్యాయ సంఘం నేతలు డీఈవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఇక్కడ ట్రస్మా ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు అబ్బాస్, టౌన్ అధ్యక్షులు శ్రీధర్, సెక్రటరీ శ్యామ్, సభ్యులు ముజీబ్, సునీల్, శివప్రసాద్, తదితరులున్నారు.

గడువులో పూర్తి సమాచారం ఎంట్రీ చేయాలి

ఎదులాపురం, నవంబర్ 21: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సీఈఈఈపీసీ సమగ్ర సర్వేలో భాగంగా 8 డాటా ఎంట్రీ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో 16న మాస్టర్ ట్రైనింగ్ ఇచ్చినట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం జడ్పీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా డాటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని 10 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు, మున్సిపాలిటీలోని 20 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లకు డాటా ఎంట్రీ ట్రెయినింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి మండలంలో శుక్రవారం ఉదయం మిగతా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ట్రైనింగ్ ఇస్తూ మధ్యాహ్నం నుంచి డాటా ఎంట్రీ మొదలు పెట్టాలన్నారు. గడువులోగా పూర్తి సమాచారం పొరపాట్లకు తావులేకుండా ఎంట్రీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, సీఈవో, డీఆర్డీవో, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

'ఆరోగ్య పాఠశాల'పై కలెక్టర్ సమీక్ష

ఎదులాపురం, నవంబర్21: జిల్లాలో ఈ నెల14 నుంచి ప్రారంభమైన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం గురువారం ముగిసింది. దీంతో కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంపై గల అభిప్రాయాలను ప్రతి మండలం నుంచి ఒక పాఠశాల విద్యార్థి ఆ పాఠశాల యొక్క ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి హాజరై గత వారంలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలను వివరించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్, మలేరియా అధికారి శ్రీధర్, డీడబ్ల్యూవో బీ సబిత, అధికారులు పాల్గొన్నారు

గ్రామస్తులు చల్లగా చూడాలని పెద్దయ్య, చిన్నయ్యకు మొక్కులు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 21: మండలంలోని లక్కారం గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గురువారం గ్రామ పెద్ద ఆత్రం సీతాగొంది గంగాధర్‌రావు ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలోని పెద్దయ్య, చిన్నయ్య దేవుళ్లను గ్రామస్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, పాడి పంటలు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, గ్రామస్తులు సాదని శివ్వన్న, బొడ్డు రాజన్న, ముంజం గంగేశ్వర్, సీపతి లింగగౌడ్, ఆరెపెల్లి గంగాధర్, కాల్వ రవి, జాదవ్ రమేశ్, గంట విజయ్, కోల సత్తన్న, పంద్ర గంగారాం, ఆత్రం తిరుపతి, ఆత్రం లక్ష్మణ్ తదితరులున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 21: ప్రభు త్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని దివ్య గార్డెన్‌లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి యేడాది పాలన పూర్తయిన సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన నిర్వహించారు. కా ర్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, AMER BIN ALI YAFAYEE S/o. ALI BIN SAYEED, H.No.4-5-447, Bhuktapur, Dist. Adilabad, is hereby change my Daughter's Name "HANAN" (Old Name) To As "HANAN AMER YAFAYEE" (New Name) holding Pass port No. L6668506 Dt.27-03-2014 to 26-03-2019 issued at Riyadh (KSA) as per her Adhar card etc. Hence Declared

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

22న జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఎదులాపురం, నవంబర్ 21 ః జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈనెల 22న ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేష్ తెలిపారు. అండర్–8, 10, 12 ఏళ్ల విభాగాల్లో బాల బాలికలను వేర్వేరుగా పరుగు, లాంగ్ జంప్, హై జంప్, కిడ్స్ జావిలిన్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు తమ వయసు ధ్రువీకరణ, ఆధార్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు

సోయా కొనుగోళ్లు

బోథ్, నవంబర్ 21 : బోథ్‌లోని మా ర్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో గురువారం వరకు 21,620 క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన 1,296 మంది రైతులకు చెందిన 43240 బస్తాల సోయాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మద్దతు ధర రూ.4892 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుల సంఘాల సభ్యులు కలిసికట్టుగా ఉండాలి

ముథోల్, నవంబర్, 21 : కుల సంఘాల సభ్యులు కలిసికట్టుగా ఉండాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ముదిరాజ్ సంఘ సభ్యులు నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న, బాలు, గడ్డం అనిల్, ముదిరాజ్ కుల సంఘ సభ్యులు, తదితరులున్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

ఎదులాపురం, నవంబర్21: వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. గురువారం సీనియర్ సిటిజన్ కార్యాలయంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వయోవృద్ధుల సమాఖ్య సహకారంతో డిజిటల్ గురుకుల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలతోపాటు చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవీదాస్ దేశ్పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంది లక్ష్మారెడ్డి, గుండా వామన్‌రావు, కే సుధాకర్, హన్మంత్ రెడ్డి, నీలాకిషన్, ఆర్ కిషోర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నేరడిగొండ, నవంబర్ 21 : విద్యార్థినులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 'ఆరోగ్య పాఠశాల'లో భాగంగా మాదకద్రవ్యాల దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధ్వంసమైన పంటల పరిశీలన

తలమడుగు, నవంబర్ 21 : మండలానికి చెందిన రావుల మోహన్ రెడ్డి ఒక ఎకరం పత్తి పంటను పందులు ధ్వంసం చేయగా మండల వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి, విస్తరణాధికారి స్ఫూర్తితో కలిసి గురువారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు అడవి పందుల దాడి నుంచి పంటలను రక్షించుకోవడానికి సోలార్, రక్షణతోపాటు చీరెలు పంట చుట్టూ కట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏవోను రైతు కోరాడు.

కమిషనర్‌కు వినతి

భైంసా, నవంబర్, 21 : చిరు వ్యాపారులందరికీ టోకెన్ రుసుంను ఒకే విధంగా వసూలు చేయాలని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్ కుమార్‌కు బీజేపీ ఫ్లోర్‌లీడర్ కపిల్ సిందే గురువారం వినతి పత్రం అందించారు. ఇక్కడ నాయకులు మల్లేశ్, రావుల పోశెట్టి, అనిల్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు తలమడుగులో ఎమ్మెల్యే పర్యటన

తలమడుగు, నవంబర్ 21 : మండలంలోని పల్లి(బీ), పల్లి(కే), అర్లి(కే) గ్రామాల్లో బీటీ రోడ్డు భూమి పూజ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం రానున్నట్టు బీఆర్‌ఎస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెంబి, నవంబర్ 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మ్యాక్స్ సొసైటీ భవనంలో ఏడీసీసీ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, ఏడీసీసీ బ్యాంక్ అధికారులు కల్పన, మచిందర్, జాదవ్, రైతులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెంబి, నవంబర్ 21: మండల కేంద్రంలోని తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, మండల కేంద్రానికి చెందిన పాకాల రాజవ్వ ఇంట్లో ఒక్కతే ఉంటున్నది. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి చేనులో పత్తి ఏరడానికి వెళ్లింది. గుర్తుతెలియని వ్యక్తులు తాళం తీయకుండా చాకచక్యంగా తలుపులు తీసి ఇంట్లోని 2.5 తులాల బంగారం చోరీ చేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్‌కు ఘటనా స్థలాని పరిశీలించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ హత్యపై విచారణకు ఎస్పీకి వినతి

నిర్మల్ అర్బన్, నవంబర్ 21 : పోగుల లత హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు గురువారం ఎస్పీ డాక్టర్ జానకి షర్మిలకు జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, దస్తురాబాద్ మండలం రేవోజీపేట్‌లో ఈనెల 8న వరకట్న వేధింపుల హత్యలో మరణించిన పోగుల లత కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. ఇక్కడ ప్రజా సంఘాల నాయకులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి మందులు వాడద్దు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్,21: మోతాదును మించి పురుగుల మందులు వాడకంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిర్మల్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు పేర్కొన్నారు. నిర్మల్ వైద్య కళాశాలలో యాంటీ మైక్రోబయోలాజికల్ రెసిస్టెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యాంటీ మైక్రోబయోలాజికల్ రెసిస్టెన్స్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఇక్కడ మైక్రోబయోలాజికల్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ ధరహాస, డీఆర్పీ డాక్టర్ రమ్య, వైద్య విద్యార్థులున్నారు.

పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

ఎదులాపురం, నవంబర్ 21 : ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. పట్టణంలోని తాటిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హమాలివాడ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, దుష్ప్రభావాలపై మెడికల్ ఆఫీసర్ అవినాష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలరోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట వైద్యసిబ్బంది తదితరులున్నారు.

పాఠశాల నూతన భవనం ప్రారంభం

తానూర్, నవంబర్, 21 : మండలంలోని భోసి గ్రామంలో శ్రీసరస్వతి శిశుమందిరంలో గురువారం పాఠశాల నూతన భవనాన్ని మల్లికార్జున్‌స్వామి పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జట్పీటీసీ బాషెట్టి రాజన్న, బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, పాఠశాల అధ్యక్షుడు మరుగొండు రాములు, సమితి అధ్యక్షుడు చాదల భోజన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి దత్త్రాతి, మండల నాయకులు, గ్రామస్తులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బజార్‌హత్నూర్, నవంబర్ 21: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని జాతర్ల గ్రామంలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ పోరెడ్డి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, జీవి రమణ, బజార్‌హత్నూర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.